క్లుప్తంగా

పెండింగ్ పనులపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పంజేషాలోని క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష నిర్వహించి డివిజన్ల వారీగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, వీధి దీపాల నిర్వహణ, రోడ్లు, ఇతర సమస్యలపై చర్చించారు. కొత్త పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహీద్, జీహెచ్ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏఈలు, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



చంద్రశేఖర్‌గుప్తాను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీనివాసుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, లక్ష్మయ్య, మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్త, జాయింట్ సెక్రటరీలుగా గౌరిశంకర్, రాంకిషన్, శ్రీధర్, కోశాధికారి కృష్ణయ్య, జాయింట్ ట్రెజరర్‌గా దండు రాజు, సభ్యులుగా బాలరాజు, జయరాం, కళ్యాణ్, లచన్న, మల్లారెడ్డి, మల్లికార్జున్‌రావు, ప్రకాష్‌రావు, ప్రసాద్, రామయ్య, శ్రీనివాస్‌లు, జీ. శ్రీకాంత్, పి. శ్రీకాంత్, సుబ్బారావు, వినోద్‌కుమార్, వీరారెడ్డి, విజయకుమార్, ఉమాపతిరావు, ఉపేందర్, ఎల్లారావును ఎన్నుకున్నారు. గత 35 ఏళ్లుగా సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏకగ్రీవంగా నియమితులైన గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తాను కాలనీవాసులు సన్మానించారు.

మర్యాదపూర్వక కలయిక



డీసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజ్యానాయక్

మలక్‌పేట: ఎస్సైగా పదోన్నతి పొందిన మురావత్ తేజ్యానాయక్ ఆదివారం సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, మలక్‌పేట ఏసీపీ సుబ్బారామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజల మన్నలు పొందేలా పనిచేయాలని డీసీపీ సూచించారని సూచించినట్లు ఎస్సై తెలిపారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీలలో లోవోల్టేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నందున ఇబ్బందులు తలెత్తుతున్నాయిని ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. ప్రాథమిక పాఠశాలను వేరోక చోట నిర్మించాలని సంకల్పించామని, అందులో భాగంగానే రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలకు అనుకూలమైన స్థలాలు ఇంకా ఎక్కడ ఎక్కడ ఉన్నాయో చూసి స్థలాన్ని ఎంపిక చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో ఉండలేక.. వీధుల్లో నడవలేక

'అవుట్‌లెట్' సమస్యతో ఆ గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు ముందుకు సాగే మార్గం లేక.. మూడేళ్లుగా నివాసాల మధ్యే పేరుకుపోయి.. ఇంట్లో ఉండలేక, వీధుల్లో నడవలేక ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మురుగు మధ్యే జన జీవనం

- 'అవుట్‌లెట్' లేక జల్‌పల్లి వాసుల ఇబ్బంది
- మూడేళ్లుగా వేధిస్తున్న సమస్య
- కలవర పెడుతున్న దోమల బెడద, భరించలేని దుర్వాసన



నివాసాల మధ్య నిలిచిన మురుగు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రం జల్‌పల్లి గ్రామం 16వ వార్డులో ఇళ్ల మధ్య మురుగు నిలిచిపోయింది. దీంతో ఇంటి నుంచి బయటకు రాలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విధిలేక రాళ్లను మురుగు మధ్య ఉంచి, వాటిపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మురుగు పారేందుకు అవుట్‌లేక.. నివాసాల మధ్యే మురుగు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోందని, దోమల విజృంభణతో విష జ్వరాల బారిన పడి, ఆస్పత్రుల పాలవుతున్నామని వార్డు ప్రజలు వాపోతున్నారు.

వెంచర్‌లో వదలద్దు

గ్రామంలోని శివ రామాంజనేయ స్వామి ఆలయ పరిసరాలలోని ఎగువ బస్తీల నుంచి వచ్చిన పైప్‌లైన్‌ను, ఆలయం ఎదురుగా ఉన్న సీసీరోడ్డు దిగువన వీధి వరకు వేసి బ్లాక్ చేశారు. సుమారు 20 గజాల మేర ప్రైవేట్ స్థలం అడ్డుగా ఉండడంతో లైన్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు అడ్డంకిగా మారింది. సమస్య పరిష్కారం కోసం స్థానికులు ఒక్కో ఇంటికి రూ.7,8 వేల చొప్పున చందాలు వేసి, 20 గజాల ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేశారు. సమస్య తీరుతుందనుకున్న తరుణంలో దిగువన ఉన్న వెంచర్ నిర్వాహకుడు అభ్యంతరం వ్యక్తంచేశారు. మురుగును ఓపెన్‌గా వెంచర్‌లో వదలవద్దని అడ్డుచెప్పాడు. వెంచర్ మీదుగా చెరువు వద్ద ఉన్న అవుట్‌లెట్ వరకు పైప్‌లైన్ తీసుకెళ్లాలని సూచించారు. అలా అయితేనే 20 గజాల స్థలం వద్ద పైప్‌లైన్‌ను ముందుకు వేయనిస్తాని స్పష్టంచేశాడు. దీంతో పైప్‌లైన్ నిర్మాణం అక్కడే ఆగిపోయింది.

చుట్టూ ఆలయాలు

గ్రామంలోని శివరామాంజనేయ, పెద్దమ్మ ఆలయం, గ్రామ బొడ్రాయిల పరిసరాలలో నిలిచిన మురుగుతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దిగువన పైప్‌లైన్ బ్లాక్ కావడంతో మురుగంతా ఎగువన నిలిచిపోతోంది. శాశ్వత పరిష్కారానికి జాప్యం కారణంగా.. మున్సిపాలిటీ సిబ్బంది రోజు విడిచి రోజు మోటార్ ద్వారా వ్యర్థ జలాలను పైప్‌ల ద్వారా దిగువన ఉన్న ఖాళీ స్థలంలో డంప్ చేస్తున్నారు. అలా పోస్తున్న మురుగుతో.. స్థానికంగా బోరు నీరు కలుషితమవుతుందని, దోమలు పెరిగి కంటి మీద కునుకులేకుండా పోతుందని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బోర్లు కలుషితం



మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో బోరు నీరు కలుషితమయింది. మున్సిపాలిటీ అధికారులు రోజు విడిచి రోజు నీటిని ఖాళీ స్థలంలో పోస్తుండడంతో దోమల బెడద ఎక్కువైంది. రాత్రిపూట నిద్ర లేకుండా చేస్తున్నాయి. చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కానుంది. అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలి. – మిలిందర్, జల్‌పల్లి

వస్తున్నారు.. పోతున్నారు



ఇంట్లో నుంచి కాలు బయట పెట్టలేకపోతున్నాం. మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. సమస్య పరిష్కరించాలని అధికారులు, పాలకులకు పలమార్లు విన్నవించాము. వారు వస్తున్నారు. చూస్తున్నారు. పోతున్నారు. కానీ సమస్యను పరిష్కరించడం లేదు. – పద్మ, జల్‌పల్లి

వాసన భరించలేక పోతున్నాం



మురుగు సమస్యను పరిష్కరించాలని మూడేళ్లుగా మున్సిపాలిటీ అధికారుల నుంచి సీడీఎంఏ వరకు విన్నవిస్తున్నాం. అయినా ప్రయోజనం లేదు. ప్రైవేట్ స్థలం అడ్డుగా ఉండడంతో చందాలు వేసుకొని అవుట్‌లెట్ కోసం భూమి కొనుగోలు చేశాం. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఇంటి ఎదుట మురుగు పేరుకుపోయి భరించలేక పోతున్నాం. కలెక్టర్ స్పందించాలి. – మురళీకృష్ణ, జల్‌పల్లి

త్వరలో పరిష్కరిస్తాం



అవుట్‌లెట్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు మురుగును తోడుతూ తరలిస్తున్నాం. విష జ్వరాలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నాం. సమస్య తీరేవరకు ఇదే విధానాన్ని కొనసాగిస్తాం. అవుట్‌లెట్ తీయడానికి కొన్ని సాంకేతిక సమస్యలున్నాయి. వాటిని అధిగమించి, దిగువన పైప్‌లైన్ పనులను త్వరలో ప్రారంభించి, మురుగు కష్టాలు తీరుస్తాం. – బి.వెంకట్రామ్, మున్సిపల్ కమిషనర్

ఆలయ ఉత్సవాలకు విరాళం



అర్చకుడికి విరాళం అందిస్తున్న దాతలు

చేవెళ్ల: భక్తిభావాన్ని అలవర్చుకోవాలని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు వెంకటనాదాచార్యులు అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలోని శ్రీదశావతార సహిత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి రాజగోపుర కలశ ప్రతిష్ఠ ఏర్పాట్లకు గ్రామానికి చెందిన దాతలు జనార్దన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఒక్కొక్కరూ రూ.50వేల చొప్పున లక్ష రూపాయలను ఆదివారం ఆలయ అర్చకుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 29 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు, రాజగోపుర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు.

'సైనికులను అవమానించడం బాధాకరం'

మొయినాబాద్‌రూరల్: సైనికులను అవమానించడం బాధాకరమని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ ఎలగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ.. భారత సైనికులను అవమానపరిచేలా.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే ఇతర నాయకులు హేళన చేస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు పార్టీలు ముఖ్యం కాదని, ఐకమత్యంగా ఉన్నప్పుడే సైనికుల్లో ధైర్యం నింపగలుగుతామన్నారు. ఇకనైనా దేశ రక్షణలో ఉన్న వారిపై ఎవరు విమర్శలు చేయొద్దని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

పహాడీషరీఫ్: మామిడిపల్లి ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ 7వ సీజన్ విజేతగా ఆర్‌బీఎం వారియర్స్ జట్టు, రన్నరప్‌గా రెడ్‌బుల్స్ జట్లు నిలిచాయి. బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 23వ తేదీన ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఏడు జట్లు మూడునెలల పాటు ఆడాయి. ఈ సందర్భంగా గ్రామ ఆలయాల కమిటీ చైర్మన్ ఎడ్ల వాసుదేవారెడ్డి విజేత జట్టుకు రూ.35 వేలు, రన్నరప్ జట్టుకు మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్‌గౌడ్ రూ.25వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్ నిర్వహణలో మాజీ కార్పొరేటర్ సుక్క శివకుమార్, గ్రామ నాయకులు నిమ్మల నరేందర్‌గౌడ్, దశరథ, లిక్కి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి వినయ్ యోగేందర్‌రెడ్డి సహకారం అందించారు. ఈ సందర్భంగా వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా కూడా స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు దిలీప్ కుమార్, కోట్ల కృష్ణ, పెరమోని నరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు నగదు అందజేస్తున్న వాసుదేవారెడ్డి

ఆరోగ్య భద్రతకు భరోసా ఆయుష్మాన్ కార్డులు



మాట్లాడుతున్న ఏవీఆర్.మూర్తి

చైతన్యపురి: ఆరోగ్య భద్రతకు ఆయుష్మాన్ కార్డులు భరోసా ఇస్తున్నాయని బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఏవీఆర్ మూర్తి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్‌లోని రామాలయంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ ఐక్యవేదిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధారణ పౌరులకు ఉత్తమమైన వైద్య సేవలు అందించటం కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ కార్డుల ద్వారా రూ.5 లక్షల వరకు కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్య ఖర్చుల కోసం ఉపకరిస్తుందన్నారు. బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దాదాపు 150 మందికిపైగా డౌన్‌లోడ్ చేసి ఉచితంగా అందించామన్నారు. ఈ సమావేశంలో సోమేశ్వరులు, మోహనాచార్య, సరళ, శ్రీనివాస్, విజయభాస్కర్, శిరిష, అనిత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

నాగోలు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కారవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు కందుల సుధాకర్ అధ్యక్షతన న్యూనాగోలు కాలనీలో ఎస్ ఏ డాంగే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ సీపీఐకి ప్రజాదరణ ఉందని అన్నారు. ఎల్‌బీనగర్ ప్రాంతంలో అనేక బస్తీలు ఏర్పాటు చేసిన ఘనత సీపీఐ పార్టీ ఎర్రజెండాకే దక్కుతుందన్నారు. కర్రెగుట్టలో జరిగే బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రతి ఒక్కరు ఖండించాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వాలు చూడాల్సింది పోయి అమాయక గిరిజనులు, ఆదివాసీలను పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 28న జరిగే సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామిడి శేఖర్ రెడ్డి, బాతరాజు నర్సింహ, సుధాకర్, శ్రీనివాస్ శోభ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రచారి

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నేతలు

షాద్‌నగర్: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పట్టణంలో బీజేపీ నేతలు టీవీల్లో వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగంలో పలు జాతీయ ప్రాధాన్యత గల అంశాలను వివరించారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర, డ్రోన్ సాంకేతికతను వాడుతూ మహిళలు వ్యవసాయం చేయడాన్ని వివరించారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌లో మేడిన్ ఇండియా సాంకేతిక విజయం, రాజకీయాల్లో మహిళల పాత్రపై ప్రధాని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. ప్రధాని ప్రసంగాన్ని బీజేపీ నేతలు ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: ప్రధాని మోదీ నేరుగా ప్రజలతో మాట్లాడేందుకు ఏర్పాటు చేసిన మన్‌కీబాత్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆదివారం ప్రధాని మోదీ 122వ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌ను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నేరుగా ప్రజలతో ప్రజల సమస్యలను తెలుసుకోవటం గొప్ప విషయమన్నారు. అలాంటి నాయకుడు మనకు ఉండటం అదృష్టమన్నారు.



షాద్‌నగర్: ప్రధాని మోదీ ప్రసంగాన్ని టీవీలో చూస్తున్న నాయకులు

బాలుడి అదృశ్యం



ఉపేందర్

హస్తినాపురం: సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఓ బాలుడు ఇంట్లో వెళ్లిపోయిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన కందుకూరి ఉపేందర్ (14) తన తల్లిదండ్రులతో కలిసి సాగర్‌కాంప్లెక్స్‌లో ఉంటున్నారు. శనివారం రాత్రి తన తండ్రిని సెల్‌ఫోన్ అడగడంతో ఇవ్వలేదు. మనస్తాపం చెందిన ఉపేందర్ కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

చైతన్యపురి: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ నుంచి అష్టలక్ష్మి ఆలయం ఆర్చి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భారత సైనికుల వీరత్వం, త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రాజభూపాల్‌గౌడ్, సామరంగారెడ్డి, శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, పవన్‌కుమార్, వంగా మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగు నిలిచి.. దుర్గంధం వ్యాపించి



ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు, అందులో ఉన్న బోర్‌మోటార్

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులోని తెట్టేకుంటతండాలో మురుగునీరు ఇళ్ల మధ్యలో చేరి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు నిలిచే ప్రదేశంలోనే గ్రామ పంచాయతీకి సంబంధించిన బోర్ కూడా ఉంది. మురుగునీరు బోర్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, ఆ నీటినే తాగుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇళ్ల మధ్యలోనే మురుగు నీరు నిలవడంతో దుర్గంధంతో పాటు దోమబెడద పెరుగుతోందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కందుకూరు: కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాల 1999–2000వ సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆ బ్యాచ్‌కు చెందిన దాదాపు వంద మంది విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఎవరెవరూ ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు చారి, పెంటయ్య, లక్ష్మారెడ్డి, వెంకటయ్య, సుదర్శన్‌రెడ్డి, ఆయూబ్, ఆనంద్‌ను సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నతనం నుంచే దైవభక్తి పెంపొందించాలి

చైతన్యపురి: చిన్నతనం నుంచే దైవభక్తి పెంపొందేలా చూడాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నర్సింహ, వీహెచ్‌పీ మాతృశక్తి సంయోజక్ నాల్లన్ చక్రవర్తుల పద్మశ్రీ అన్నారు. శ్రీవిరాట్ విశ్వకర్మ సేవా సమితి సౌజన్యంతో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 25 రోజుల పాటు నిర్వహించిన బాల సంస్కార వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం గౌతంనగర్‌లో జరిగింది. ముఖ్య వక్తలుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అనేది మన సనాతన ధర్మం అని నేడు విజయాల కన్నా జీవన విధానం గొప్పదన్నారు. పిల్లలకు దైవభక్తి, దేశభక్తి అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలోఅనంతాచారి, లింగాల ప్రవీణ్, లోక్‌నాథ్, సద్దిశ్రీవాణి, లతశ్రీ, మహాలక్ష్మి, లక్ష్మీనారాయణ, జ్యోతి, లావణ్య పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న నర్సింహమూర్తి

భారత సైన్యానికి అండగా ఉందాం

దిల్‌సుఖ్‌నగర్: భారత జాతి ఆత్మగౌరవం కాపాడుటకు మోదీ విశ్వ ప్రయత్నం చేస్తున్నారని భారత సైన్యం, మోదీకి మనమందరం అండగా ఉందామని ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. సిటిజెన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొత్తపేట ఓమ్ని హాస్పిటల్ నుంచి ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి కమాన్ వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో వారు పాల్గొని దేశ సైనిక అధికారులు వ్యోమికా సింగ్, సోఫియా ఖురేషి, ఉగ్రవాదులను అంతమొందించేందుకు ముందుకు రావడం గర్వకారణమన్నారు. 25 నిమిషాల్లో 9 పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద మూకల స్థావరాలపై దాడులు చేసి మన దేశ ఘనత చాటి చెప్పామని తెలిపారు. గతంలో దొంగచాటుగా ఉగ్ర మూకలు దాడులు చేశాయని నరేంద్ర మోదీ హయాంలో ఉగ్రవాదాన్ని అంత మొందించడానికి 356 ఆర్టికల్ రద్దు చేసి లాల్ చౌక్ పై మువ్వన్నెల జెండా ఎగరవేసిన మహనీయుడు అన్నారు. నేటి యువత సైన్యంతో కలిసి పోరాడానికి సిద్ధంగా ఉందన్నారు.ఈ తిరంగా యాత్రలో ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధరీజ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామ రంగారెడ్డి, పిట్ట ఉపేందర్‌రెడ్డి, శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు కృషిచేస్తామని మద్దూరు మాజీ సర్పంచ్ పట్లోళ్ల నరేందర్‌రెడ్డి, మాజీ సహకార సంఘం డైరెక్టర్ రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మద్దూరులో దివంగత నేత పట్లోళ్ల లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు గత 15 రోజులుగా ఎంపీఎస్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి హైదరాబాద్ సన్‌రైజర్ జట్టుకు రూ.1 లక్ష నగదు, రెండో బహుమతి ముంబాయి జట్టుకు రూ.25వేల నగదు, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కృషి పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. ఓటమి, గెలుపునకు నాంది కావాలన్నారు. కార్యక్రమంలో కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్, నాయకులు సుధాకర్‌గౌడ్, బాల్‌రాజ్‌యాదవ్, విగ్నేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.